సాక్షి
మహబూబ్‌నగర్

శనివారం : 22 : జూన్ : 2024



మార్కెట్ కమిటీలపై గురి

మార్కెట్ కమిటీల నియామకంపై కాంగ్రెస్ నాయకులు ఆశలు పెంచుకుంటున్నారు.

వివరాలు 8లో ▸



గద్వాలలో భారీ చోరీ

గద్వాల పట్టణంలో గుర్తు తెలియని దుండగులు ఓ ఇంట్లో చోరీకి పాల్పడ్డారు.

వివరాలు 8లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం 33.5 /24.2

రోజంతా ఆకాశం మేఘావృతమై ఉంటుంది. సాయంత్రం, రాత్రివేళలో మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉంది.

దేవుడా..

ధూపం, దీపం, నైవేద్యం.. సమర్పయామి!



ఇది జోగుళాంబ గద్వాల జిల్లా అయిజ మండలం పులికల్ గ్రామంలోని ఓ ఇంటి ఫొటో. ఇందులో శౌచాలయం పక్కన నిర్మాణంలో ఉన్న గదిని రంగనాథ స్వామి ఆలయంగా (బాణం గుర్తు చూపిస్తున్నది) చెబుతున్నారు. దీనినే దేవాదాయ శాఖ ధూప, దీప, నైవేద్య పథకానికి ఎంపిక చేసింది. ఇంతకు ముందు గుడి ఉంటే.. దాన్ని తొలగించి పునరుద్ధరిస్తున్నారని ఎవరైనా అనుకుంటే తప్పులో కాలేసినట్లే. ఓ వ్యక్తి తన ఇంటినే గుడిగా చూపించి దేవాదాయ శాఖ ద్వారా అప్పనంగా నెలనెలా రూ.10 వేలు వేతనంగా పొందుతున్నారు.

- దేవాదాయ శాఖలో యథేచ్ఛగా అవినీతి పర్వం
- ముడుపులు, నజరానాలతో అక్రమార్కుల మాయాజాలం
- లేని గుడి పేరిట నెలనెలా రూ.10 వేలు కాజేస్తున్న అక్రమార్కులు

సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్: ధూప, దీప, నైవేద్య పథకంలో అక్రమాలకు అంతే లేకుండాపోయింది. కొరవడిన దేవాదాయశాఖ ఉన్నతాధికారుల పర్యవేక్షణ, పలువురు జిల్లాస్థాయి అధికారులు, సిబ్బంది ధనదాహం వెరసి అవినీతి పర్వం మూడు పువ్వులు.. ఆరుకాయలు అన్నట్లుగా కొనసాగుతోంది. ముడుపులు, నజరానాలతో అక్రమార్కులు మాయాజాలం ప్రదర్శిస్తుండడంతో సర్కారు ఖజానాకు భారీగా చిల్లు పడుతోంది. విధులకు హాజరుకాకుండానే చక్రం తిప్పుతూ వేతనం కాజేస్తున్న అర్చకులు కోకొల్లలు కాగా.. లేని గుడి పేరిట ధూప, దీప, నైవేద్య పథకం కింద కొందరు నెలనెలా అప్పనంగా జీతాలు అందుకుంటున్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఈ దందా నిరాటంకంగా కొనసాగుతున్నట్లు 'సాక్షి' పరిశీలనలో తేలింది.

దాదాపుగా అన్ని జిల్లాల్లోనూ..

రాష్ట్రంలో మూడు విడతల కింద 6,400 పైచిలుకు ఆలయాలను ధూప, దీప, నైవేద్య పథకానికి ఎంపిక చేశారు. ఈ మేరకు ఒక్కో ఆలయానికి అక్కడి అర్చకుడి పేరిట దేవాదాయ శాఖ నెలకు రూ.10 వేల చొప్పున అందజేస్తోంది. ఈ లెక్కన అన్ని ఆలయాలకు కలిపి ప్రభుత్వం నెలకు సుమారు రూ.6.40 కోట్లు వెచ్చిస్తోంది. అయితే లేని గుడి పేరిట గద్వాల జిల్లా పులికల్‌లో ధూప, దీప, నైవేద్య పథకం పక్కదారి పట్టినట్లు వెలుగులోకి రాగా.. రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో సైతం ఈ అక్రమ బాగోతం నిరాటంకంగా సాగుతున్నట్లు తెలుస్తోంది. వికారాబాద్ జిల్లాలో సుమారు 190 ఆలయాలు ఉండగా.. 40 శాతం వరకు లేని గుళ్లను ధూప, దీప, నైవేద్య పథకానికి ఎంపిక చేసినట్లు సమాచారం. ఇందులో సగం వరకు ఆలయాలు నిర్మాణంలో ఉన్నట్లు అర్చక సంఘాలు చెబుతున్నా.. వీటిని ముందస్తుగానే పథకం అమలు చేయడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అదేవిధంగా ఉమ్మడి పాలమూరు, రంగారెడ్డి, జనగామతో పాటు దాదాపుగా అన్ని జిల్లాల్లో సైతం ఈ పథకం పక్కదారి పట్టినట్లు తెలుస్తోంది.

వైఎస్ హయాంలో పథకం అమల్లోకి..

గతంలో గ్రామీణ ప్రాంతాల్లోని అర్చకులు ఉపాధి లేకపోవడంతో పట్టణాలకు వలస వెళ్లేవారు. దీంతో అక్కడి ఆలయాల్లో ధూప, దీప, నైవేద్యాలు లేక గుడిగంటలు మూగబోయి అంధకారంలో ఉండిపోయాయి. హైందవ ధర్మానికి పునాది అయిన ఆలయాల్లో వెలుగులు నిండాలని అర్చక సమాఖ్య విజ్ఞప్తి మేరకు అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి, దివంగత మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి ధూప, దీప, నైవేద్య పథకానికి శ్రీకారం చుట్టారు. ఈ మేరకు ఒక్కో అర్చకుడికి నెలకు రూ.2,500 వేతనంతో పథకాన్ని అమల్లోకి తెచ్చారు. ఇందులో అర్చకుడి భృతికి రూ. 1,500, ధూప, దీప, నైవేద్య ఖర్చులకు రూ. వెయ్యి కేటాయించారు. అనంతర కాలంలో అర్చకుల వేతనం రూ.6 వేలు.. ఆ తర్వాత రూ.10 వేలకు చేరుకుంది. అయితే దేవాదాయశాఖలో ఒకేచోట తిష్ట వేసి.. అవినీతికి అల వాటు పడిన పలువురు అధికారులు, సిబ్బంది నిర్వాకానికి తోడు ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేమితో ఈపథకం లక్ష్యం నీరుగారుతోంది.

మంజూరులోనే మాయ..

ధూప, దీప, నైవేద్య పథకం అమలుకు సంబంధించి ప్రభుత్వం తగిన మార్గదర్శకాలు నిర్దేశించింది. ఆలయ అర్చకులకు పూజా విధానంపై పరిజ్ఞానం ఉందా? లేదా? అని నిర్ధారించాలి. ఈ మేరకు అనుభవజ్ఞులైన అర్చకులతో ఏర్పాటు చేసిన త్రీమెన్ కమిటీతో కలిసి అధికారులు స్వయంగా ఆయా ఆలయాలను సందర్శించడంతో పాటు అర్చకులను పరీక్షించాలి. త్రీమెన్ కమిటీ పేరుకు మాత్రమే కాగా.. అంతా అధికారులే అన్నీ తామై నడిపిస్తున్నట్లు తెలుస్తోంది. జోగుళాంబ గద్వాల జిల్లా పులికల్‌లో ఇదే జరిగినట్లు సమాచారం. ఈ పథకం కింద ఎంపిక చేయాలంటే పలు చోట్ల అధికారులు రేటు ఫిక్స్ చేసినట్లు సమాచారం. జిల్లా, ఆలయాన్ని బట్టి రేటు మారడంతో పాటు కొన్ని చోట్ల ముడుపులతో పాటు నజరానాల పర్వం సైతం నడుస్తున్నట్లు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పులికల్ బాగోతంపై దేవాదాయశాఖ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వరిని ఫోన్‌లో సంప్రదించగా.. 'విచారణ సమయంలో సెలవులో ఉన్నా. మరొకరు విచారణకు వెళ్లారు. ప్రస్తుతం విషయం తెలిసి ఈ ఆలయాన్ని బ్లాక్ లిస్ట్‌లో పెట్టాం' అని సమాధానం చెప్పారు.

గద్వాల జిల్లా పులికల్‌లో వెలుగులోకి..

జోగుళాంబ గద్వాల జిల్లాలోని అయిజ మండలం పులికల్ గ్రామంలోని మూడు ఆలయాలు (గుంటి రంగనాథ ఆంజనేయస్వామి, శ్రీ ఆంజనేయ స్వామి, శ్రీరంగనాథ స్వామి) ధూప, దీప, నైవేద్య పథకానికి ఎంపికయ్యాయి. అయితే ఈ గ్రామంలో అసలు రంగనాథ స్వామి ఆలయమే లేదు. రాజపురంలో ఊరి చివర గుంటి రంగనాథస్వామి ఆలయం ఉంది. ప్రతి ఏటా ఫిబ్రవరిలో ఉత్సవాల సమయంలో పులికల్ నుంచి ఉత్సవ విగ్రహాలను రాజపురంలోని గుంటి రంగనాథస్వామి ఆలయానికి చేర్చి పూజలు చేయడం ఆనవాయితీ. దీన్ని సాకుగా చూపించి రాజపురంలో ఉండే గుంటి రంగనాథస్వామి ఆలయంతో పాటు పులికల్‌లోని తన ఇంటిని కూడా గుడిగా చూపించి ఈ పథకం మంజూరు చేయించుకున్నట్లు తెలుస్తోంది.

ఫేక్ ఆలయాలపై విచారణ జరపాలి..



ధూప, దీప, నైవేద్య పథకం ఎంపికలో దేవాదాయ శాఖలోని అవినీతి అధికారులు నిబంధనలకు తూట్లు పొడిచారు. డబ్బులు తీసుకుని ఆలయాలు కానీ వాటిని కూడా ఆలయాలుగా చూపించి పథకాన్ని మంజూరు చేశారు. దీనిపై ప్రభుత్వం పూర్తిస్థాయిలో విచారణ జరిపాలి. అవినీతి అధికారులపై చర్యలు తీసుకోవాలి.

– తంబలి రాజశేఖర్ శర్మ, హిందూ ధార్మిక సేన రాష్ట్ర అధ్యక్షుడు



ఇది రాజపురంలోని గుంటి రంగనాథ స్వామి ఆలయం. దీని పేరిటే పులికల్‌లో గుడి పేరిట ఇంటికి ధూప, దీప, నైవేద్య పథకం మంజూరు చేశారు. ప్రస్తుతం రెండింటికీ సంబంధించి ఇద్దరు పూజారులకు రూ.10 వేల చొప్పున వేతనం అందుతోంది.

న్యూస్‌రీల్

ప్రయాణికుల సమస్యలు పరిష్కరిస్తాం : ఆర్‌ఎం



స్టేషన్ మహబూబ్‌నగర్: ప్రయాణికుల సూచనలను పరిశీలించి వాటిని పరిష్కరిస్తామని ఆర్టీసీ రీజినల్ మేనేజర్ శ్రీదేవి తెలిపారు. శుక్రవారం సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు డయల్ యువర్ ఆర్‌ఎం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్‌ఎం పలువురు ప్రయాణికుల నుంచి ఫోన్ ద్వారా సూచనలు తీసుకున్నారు. మహబూబ్‌నగర్ నుంచి అదిలాబాద్ వరకు బస్సు నడపాలని, ప్రతి అర గంటకు మహబూబ్‌నగర్ నుంచి గచ్చిబౌలీ వరకు బస్సులు నడపాలని, మహబూబ్‌నగర్ నుంచి నవాబ్‌పేట, కొల్లూరు, కొందుర్గు, తూంపల్లి మీదుగా చౌదర్‌గూడ వరకు బస్సు నడపాలని, మహబూబ్‌నగర్ నుంచి కోయిల్‌కొండ, లింగాల్‌చేడ్, గుండుమాల్, పెద్దాపురం, వీరారం, కొమ్మూరు మీదుగా కోస్గికి బస్సు నడపాలని ప్రయాణికులు కోరారు. అదేవిధంగా నాగర్‌కర్నూల్ నుంచి బిజినేపల్లి మీదుగా నందివడ్డెమాన్ బస్సును పునరుద్ధరించాలని, వనపర్తి నుంచి రాయచూర్‌కు ఎక్స్‌ప్రెస్ బస్సులు నడపాలని, యానాగుంది– గుండుమాల్ నైట్ హాల్ట్ బస్సు నడపాలని, గోపల్‌దిన్నె, వీపనగండ్ల మీదుగా కొల్లాపూర్‌కు బస్సు నడపాలని సాయంత్రం 4 గంటల నుంచి కొడంగల్ నుంచి మహబూబ్‌నగర్‌కు బస్సులు అందుబాటులో ఉంచాలని కోరారు.

న్యాక్‌తో జేపీఎన్‌సీ అవగాహన ఒప్పందం



మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జేపీఎన్‌సీ ఇంజినీరింగ్ కళాశాల, న్యాక్ శుక్రవారం కళాశాలలో అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నాయి. ఈ మేరకు హైదరాబాద్ న్యాక్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో న్యాక్ ప్రతినిధులతో కళాశాల చైర్మన్ రవికుమార్ ఒప్పంద పత్రాలను మార్చుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కళాశాలకు చెందిన సివిల్ ఇంజినీరింగ్ విద్యార్థులు మూడు నెలల పాటు శిక్షణ పొందేందుకు ఈ అవగాహన ఒప్పందం దోహదపడుతుందన్నారు. శిక్షణ పొందిన అనంతరం విదేశీ సంస్థలలో ఉద్యోగాలు పొందే అవకాశం లభిస్తుందన్నారు. అవగాహన ఒప్పందం కోసం కృషి చేసిన న్యాక్ డైరెక్టర్ రాజిరెడ్డికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

రేపు వందేమాతరం ప్రతిభ అవార్డులు

జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): వందేమాతరం ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం జిల్లాకేంద్రంలోని అన్నపూర్ణ గార్డెన్‌లో ఉదయం 10 గంటలకు జిల్లాలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో 2023– 24 విద్యా సంవత్సరంలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ప్రతిభ అవార్డులు ప్రదానం చేస్తామని ఫౌండేషన్ నిర్వాహకుడు రవీందర్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, డాక్టర్ జగన్, గ్రీన్‌కోర్ రెవల్యూషన్ వ్యవస్థాపకుడు లీలాలక్ష్మారెడ్డి, దేశాయి ప్రకాష్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరవుతారన్నారు.

వసతి గృహాల్లో తనిఖీలు



పాలమూరు: జిల్లాకేంద్రంలోని ఎస్సీ, బీసీ బాలికల వసతి గృహాలను శుక్రవారం జిల్లా ఫుడ్ ఇన్‌స్పెక్టర్ మనోజ్‌కుమార్ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా వసతి గృహాల్లో వంట తయారీ కోసం ఉపయోగిస్తున్న కిరాణ సామగ్రి, నూనె, పప్పు ఇతర పదార్థాల నాణ్యతను పరిశీలించారు. అలాగే కూరగాయలు పరిశుభ్రమైనవి వాడుతున్నారా.. లేదా.. అని ఆరాతీశారు. విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించాలని సిబ్బందికి సూచించారు.

మొక్కజొన్న @ 2,527

జడ్చర్ల: బాదేపల్లి మార్కెట్‌లో శుక్రవారం మొక్కజొన్న క్వింటాలుకు గరిష్టంగా రూ.2,527, కనిష్టంగా రూ.2,142 ధరలు లభించాయి. అదేవిధంగా ధాన్యం ఆర్‌ఎన్‌ఆర్ రకం గరిష్టంగా రూ.2,436, కనిష్టంగా రూ.1,969 ధరలు కేటాయించారు.

వెల్ఫేర్ ఆఫీసర్స్ పరీక్షకు పకడ్బందీ ఏర్పాట్లు



మాట్లాడుతున్న కలెక్టర్ విజయేందిర బోయి

జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): టీజీపీఎస్‌సీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ గ్రేడ్– 2, డివిజనల్ అకౌంట్స్ అధికారుల పరీక్షలను జిల్లాలో ప్రశాంతంగా నిర్వహించేందుకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ విజయేందిర అన్నారు. సోమవారం నుంచి వచ్చే శనివారం వరకు జరగనున్న ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమ హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ల నియామక రాత పరీక్షతోపాటు ఈ నెల 30 నుంచి వచ్చే నెల 4 వరకు కొనసాగనున్న డివిజనల్ అకౌంట్స్ ఆఫీసర్ నియామక రాత పరీక్షను పురస్కరించుకుని శుక్రవారం కలెక్టరేట్‌లోనీ సమావేశ మందిరంలో ఫ్లయింగ్ స్క్వాడ్, డిపార్ట్‌మెంటల్, గుర్తింపు అధికారులకు అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎలాంటి లోటుపాట్లు, గందరగోళానికి తావులేకుండా ప్రశాంత వాతావరణంలో పరీక్షలు జరిగేలా చర్యలు చేపట్టాలన్నారు. హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్, డివిజనల్ అకౌంట్స్ ఆఫీసర్ నియామక రాత పరీక్షలో నిర్ణీత తేదీలలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు, తిరిగి మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు రెండు సెషన్లలో జరుగుతాయన్నారు. అభ్యర్థులు కాలిక్యులేటర్లు, గణిత పట్టికలు, లాగ్ బుక్, సెల్‌ఫోన్లు, బ్లూటూత్ పరికరాలు, వాచ్, లాగ్ టేబుల్, వాలెట్, హ్యాండ్ బ్యాగ్‌లు, రైటింగ్ ప్యాడ్, నోట్స్, చార్ట్‌లు, లూజ్ షీట్‌లు తీసుకురావొద్దన్నారు. అభ్యర్థుల చెకింగ్, హాల్‌టికెట్ పరిశీలనకు గుర్తింపు అధికారులు తగిన ఏర్పాట్లు చేయాలన్నారు.

మాత మరణాలు అరికట్టాలి

జిల్లాలో మాత మరణాలు జరగకుండా నివారించాలని కలెక్టర్ విజయేందిర బోయి అన్నారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో మాత మరణాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రసవ సమయంలో వివిధ కారణాలతో మరణిస్తున్న గర్భిణులకు సరైన చికిత్స అందించి సంరక్షించాలన్నారు. చికిత్సలో ఎలాంటి నిర్లక్ష్యం ఉండకూడదని, వైద్యులు, సిబ్బందికి శిక్షణ ఇవ్వాలని సూచించారు. జిల్లాలో 2021–22 సంవత్సరంలో 27, 2022– 23లో 11, 2023–24లో 11 మాత మరణాలు సంభవించాయని, ఈ మరణాలకు ప్రసవ సంబంధ, ఇతర కారణాలు ఉన్నాయన్నారు. మరణాలకు కారణాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వైద్యాధికారులు, మరణించిన వారి కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్, మాత ఆరోగ్య సంరక్షణ ప్రోగ్రా అధికారి భాస్కర్‌నాయక్, డీఎంహెచ్‌ఓ కృష్ణ, జనరల్ ఆస్పత్రి సూపరింటెండెంట్ జీవన్, మాత సంరక్షణ కేంద్రం హెచ్‌ఓడీ రాధ, ఐఎంఏ అధ్యక్షుడు రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

డంపింగ్ యార్డుకు అప్రోచ్‌రోడ్డు నిర్మించండి



అప్రోచ్ రోడ్డు నిర్మించాలని ఎన్‌హెచ్‌ఏఐ అధికారులను ఆదేశిస్తున్న అదనపు కలెక్టర్ మోహన్‌రావు

- రెవెన్యూ అడిషనల్ కలెక్టర్ మోహన్‌రావు ఆదేశం
- భూత్పూర్–చించోళి హైవేతో 20 మీ. లోతుకు డీఆర్‌సీసీ

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: కోయిల్‌కొండ ఎక్స్‌రోడ్డులోని డంపింగ్‌యార్డు మెయిన్ గేట్ నుంచి 50 ఫీట్ల లోపలి నుంచి భూత్పూర్– చించోళి హైవే వెళ్తుండటంతో అప్రోచ్‌రోడ్డు నిర్మించాలని ఎన్‌హెచ్‌ఏఐ అధికారులకు రెవెన్యూ అడిషనల్ కలెక్టర్ మోహన్‌రావు సూచించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు శుక్రవారం ఆ ప్రాంతానికి వెళ్లి క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అక్కడ గుట్ట ప్రాంతం కావడంతో డీఆర్‌సీసీకి చేరుకోవాలంటే 20 మీటర్ల లోతు ఏర్పడుతుందన్నారు. దీనిని నివారించేందుకు అప్రోచ్ రోడ్డు తప్పనిసరి అని పేర్కొన్నారు. అలాగే పట్టణానికి సమీపంలోనే ఈ డంపింగ్ యార్డు ఉండటం వల్ల ప్రజలకు ఎన్నో ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. త్వరలోనే మరోచోటకు మార్చాలనుకుంటున్నామని, మౌలాలిగుట్ట వద్ద ఏర్పాటు చేయడానికి సన్నాహాలు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ డి.మహేశ్వర్‌రెడ్డి, డిప్యూటీ ఈఈ బెంజిమన్, ఏఈ సాయిరాం, మహబూబ్‌నగర్ అర్బన్ మండల డీటీ దేవేందర్, ఆర్‌ఐ నర్సింగ్, సర్వేయర్ రఘు, ఎన్‌హెచ్‌ఏఐ ఏఈ సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

మరో నాలుగు పీజీ సీట్లు

- ప్రభుత్వ మెడికల్ కళాశాలలో 30కి చేరిన సంఖ్య



స్వీట్లు తినిపించుకుంటున్న కళాశాల అధికారులు

పాలమూరు: పాలమూరు ప్రభుత్వ మెడికల్ కళాశాలకు కొత్తగా పిడియాట్రిక్ విభాగంలో నాలుగు పీజీ సీట్లు మంజూరు చేస్తూ జాతీయ మెడికల్ కౌన్సిల్ (ఎన్‌ఎంసీ) శుక్రవారం మెయిల్ ద్వారా కళాశాల అధికారులకు తెలిపింది. కొత్తగా వచ్చిన నాలుగు పిడియాట్రిక్ పీజీ సీట్లు 2024– 25 నుంచే అమల్లోకి రానున్నాయి. దీంతోపాటు ఈ ఏడాది అప్తామాలజీ, అనస్తీషియా విభాగాలకు సైతం పీజీ సీట్ల కోసం కళాశాల అధికారులు దరఖాస్తు చేయగా ఆయా విభాగాల్లో ప్రొఫెసర్లు లేరంటూ కారణం చూపుతూ ఎన్‌ఎంసీ తిరస్కరించింది. అయితే పాలమూరు మెడికల్ కళాశాలలోని అనస్తీషియాలో విభాగంలో ఆరేళ్లుగా, అప్తామాలజీ విభాగంలో నాలుగు ఏళ్లుగా ప్రొఫెసర్లు పనిచేస్తున్నట్లు కళాశాల డైరెక్టర్ రమేష్ వెల్లడించారు. వీటిపై మరోసారి పూర్తిస్థాయిలో నివేదిక జాతీయ మెడికల్ కౌన్సిల్‌కు అప్పీల్ చేసుకోవడానికి అవకాశం ఉందన్నారు. మెడికల్ కళాశాలలో ఇప్పటి వరకు 9 విభాగాల్లో 26 పీజీ సీట్లు ఉండగా కొత్తగా పీడియాట్రిక్ విభాగంలో వచ్చిన నాలుగు సీట్లతో 30కి చేరాయి. కళాశాలలో పీజీ సీట్లు పెరగడంతో వైద్య సేవలు మెరుగుపడనున్నాయి. సీట్లు రావడానికి కృషి చేసిన బోధనాచార్యులు, సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు.

ఉత్సాహంగా యోగా దినోత్సవం

మహబూబ్‌నగర్ క్రీడలు: జిల్లావ్యాప్తంగా అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని శుక్రవారం ఉత్సాహంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాకేంద్రం మెయిన్ స్టేడియంలోని మల్టీపర్పస్ ఇండోర్ స్టేడియంలో జిల్లా పతంజలి యోగా సమితి, భారత్ స్వాభిమాన్ ట్రస్ట్, ఆయుష్, నెహ్రూ యువకేంద్రం, బ్రహ్మకుమారీస్, రామచంద్ర మిషన్, పిరమిడ్స్ యోగా మెడిటేషన్, యోగా స్పోర్ట్స్ అసోసియేషన్, జిల్లా స్పోర్ట్స్ అథారిటీ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో సాధకుల విన్యాసాలు ఆకట్టుకున్నాయి. మొదటిసారిగా నూతన ఇండోర్ స్టేడియంలో అంతర్జాతీయ యోగా దినోత్సవం నిర్వహించారు.

ఆకట్టుకున్న యోగాసనాలు..

ముందుగా సామూహిక యోగా విన్యాసాలు చేశారు. రామచంద్రమిషన్ ప్రతినిధి గద్దె ఆంజనేయులు ధ్యానం చేయించారు. అనంతరం పలువురు ప్రదర్శించిన యోగాసనాలు ఆకట్టుకున్నాయి. యోగా క్రీడాకారిణి వనజారెడ్డి తన కూతురితో కలిసి చేసిన యోగా విన్యాసాలు అలరించాయి. అదేవిధంగా గార్లపహాడ్ జెడ్పీహెచ్‌ఎస్ విద్యార్థులు, రెడ్‌క్రాస్ అనాథ శరణాలయంలో శిక్షణ తీసుకున్న విద్యార్థులు, కరాటే వెంకటేశ్ చేసిన యోగాసనాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. అంతర్జాతీయ యోగా దినోత్సవంలో ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు. కార్యక్రమంలో డీఎఫ్‌ఓ సత్యనారాయణ, డీఎంహెచ్‌ఓ కృష్ణ, నెహ్రూ యువ కేంద్రం కోఆర్డినేటర్ కోటనాయక్, డీవైఎస్‌ఓ శ్రీనివాస్, పతంజలి జిల్లా అధ్యక్షులు గంగాధర్, భారత్ స్వాభిమాన్ ట్రస్ట్ జిల్లా అధ్యక్షుడు వెంకట్రాముడు, పీవైఎస్ యువ ప్రభారి సురేష్, జిల్లా యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి సాయికుమార్, రెడ్‌క్రాస్ చైర్మన్ నటరాజ్, కౌన్సిలర్ రాము, ప్రముఖ న్యాయవాది మనోహర్‌రెడ్డి, యాదిరెడ్డి, పాండురంగారెడ్డి, పాండురంగం, ఆయుష్ శాఖ డాక్టర్ ఫయీం, లక్ష్మి, సునీత తదితరులు పాల్గొన్నారు.



యోగా చేస్తున్న ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్



సామూహిక యోగాసనాలు వేస్తున్న అభ్యాసకులు



యోగాసనాలు చేస్తున్న విద్యార్థులు

క్లుప్తంగా

ఉరేసుకుని యువకుడి ఆత్మహత్య


సురేష్(ఫైల్)

అమరచింత: పట్టణంలోని శ్రీకృష్ణ నగర్‌లో నివాసముంటున్న బొగ్గు సురేష్ (27) ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య చెసుకున్న సంఘటన శుక్రవారం చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. రెండు నెలల కిందట సురేష్‌కు మండలంలోని సింగంపేటలో ఉంటున్న తన అక్క కుమార్తెతో వివాహమైంది. వివాహం జరిగి రెండు నెలలు గడువక ముందే యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడు సురేష్ పట్టణంలోని విజేత ఉన్నత పాఠశాలలో బస్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు.

నీటికుంటలో యువకుడి మృతి

కేటీదొడ్డి: ప్రమాదవశాత్తు నీటికుంటలో పడి యువకుడు మృతి చెందిన ఘటన శుక్రవారం మండలంలో చోటు చేసుకుంది. కుచినెర్ల చెందిన సిద్దన్నపల్లి కర్రెప్పకు ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. రెండో కుమారుడు వీరేష్ (19) ఉదయం 5 గంటల సమయంలో బహిర్భూమికి వెళ్లి తిరిగి వస్తుండగా ప్రమాదవశాత్తు నీటికుంటలో పడిపోయాడు. ఈయనకు ఈత రాకపోవడంతో మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు.

గుర్తుతెలియని మృతదేహం లభ్యం

రాజోళి: మండల కేంద్రంలోని తుంగభద్ర నదిపై గల సుంకేసుల డ్యాంలో గుర్తుతెలియని మృతదేహం లభ్యమైనట్లు ఎస్‌ఐ జగదీష్ తెలిపారు. నదిలో మృతదేహం ఉన్నట్లు సమాచారం రావడంతో గురువారం వెలికితీశారు. మృతి చెందిన మగ వ్యక్తి శరీరంపై ఎలాంటి దుస్తులు లేవని, నదిలో ప్రమాదశాత్తు పడిపోయాడా?ఆత్మహత్య చేసుకున్నాడా? అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నామని, బ్యారేజీలోని 30వ గేటు వద్ద మృతదేహం లభ్యమైనట్లు ఎస్‌ఐ తెలిపారు. శరీరంపై అమ్మ అనే అక్షరాలతో పాటు ఇతర పచ్చబొట్లు ఉన్నాయని ఎవరికైనా ఆనవాళ్లు తెలిసిఉంటే రాజోళి పోలీస్‌స్టేషన్ లో సంప్రదించాలని సూచించారు.


మనస్తాపంతో బాలిక బలవన్మరణం

భూత్పూర్: మున్సిపాలిటీ పరిధిలోని అమిస్తాపూర్ చెందిన ఓ బాలిక మనస్తాపానికి గురై శుక్రవారం ఆత్మహత్యకు పాల్పడింది. ఎస్‌ఐ శ్రీనివాసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన బాలిక ఇటీవల మహబూబ్‌నగర్‌లోని గాంధీరోడ్ హైస్కూల్‌లో పదో తరగతి చదివి ఫెయిల్ అయ్యింది. దీంతో తరుచూ ఇంట్లో తల్లి వద్ద బాధపడుతూ ఉండేది. తల్లి వ్యవసాయ పొలం వద్దకు వెళ్లి, సాయంత్రం తిరిగి ఇంటికి రాగా కూతురు ఇంట్లో ఉరేసుకుంది. పదో తరగతిలో ఫెయిల్ కావడంతో తరుచూ బాధపడుతూ ఉండటంతో తీవ్ర మనస్తాపం చెందిన ఆత్మహత్య చేసుకుందని తల్లి తెలిపింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వివరించారు.

ఇద్దరు వ్యక్తుల ఘర్షణ: కేసు నమోదు

ఉండవెల్లి: మండలంలో ఇద్దరు వ్యక్తుల ఘర్షణ పడగా ఇరువురి ఫిర్యాదు మేరకు శుక్రవారం కేసు నమోదైంది. ఎస్‌ఐ శ్రీనివాసులు తెలిపిన వివరాల ప్రకారం.. మారమునగాల-2లో యాదగిరిరెడ్డి పొలంలో చాకలి నాగరాజు పొలం పనులకు కూలీకి వెళ్లాడు. రాంభూపాల్‌రెడ్డి పొలం దున్నడానికి పరశురాముడు ట్రాక్టర్ తీసుకుని వెళ్లారు. పనులు ముగించుకుని గురువారం రాత్రి వెళ్తున్న క్రమంలో నాగరాజు బైక్‌ను పరశరాముడి పక్కకు తీసుకెళ్లాడు. దీంతో ఇద్దరు మాటలు అనుకుని అక్కడినుంచి వెళ్లిపోయారు. శుక్రవారం ఉదయం పరశరాముడు ట్రాక్టర్‌కు ఉన్న కొడవలితో నాగరాజు తలపై దాడి చేయగా తీవ్ర గాయాలయ్యాయి. చాకలి నాగరాజు కూడా పరశురాముడిని కర్రతో తలపై దాడి చేయగా గాయాలయ్యాయి. కాగా వీరి ఇరువురు ఫిర్యాదు మేరకు కేసులు నమోదైనట్లు ఎస్‌ఐ తెలిపారు. నాగరాజు తలకు బలమైన గాయాలవడంతో కర్నూల్ ఆస్పత్రికి తరలించారు.

గొర్రెల కాపరిపై మొసలి దాడి


గాయపడిన ఆంజనేయులు

ఆత్మకూర్: గొర్రెల కాపరిపై మొసలి దాడి చేయడంతో తీవ్ర గాయాలైన ఘటన శుక్రవారం వనపర్తి జిల్లా ఆత్మకూర్ మండలంలో చోటు చేసుకుంది. బాధితుడు, మత్స్యకారులు, రైతుల కథనం మేరకు.. ఖానాపూర్‌కు చెందిన ఆంజనేయులు తన గొర్రెల మందను తీసుకొని ఉదయం మూలమళ్ల సమీపంలో కృష్ణానది ఒడ్డుకు వెళ్లారు. మందలోని ఒక గొర్రె నీరు తాగేందుకు నదిలోకి వెళ్లగా మొసలి దాడి చేసింది. గుర్తించిన కాపరి ఆంజనేయులు గొర్రెను కాపాడేందుకు యత్నిస్తుండగా.. మొసలి అతడి కుడి కాలుని పట్టుకొని నీటిలోకి లాక్కెళ్లేందుకు ప్రయత్నం చేసింది. వెంటనే అప్రమత్తమై దాని బారి నుంచి తప్పించుకొని బయటకు వచ్చారు. తీవ్ర గాయం కావడంతో అరుపులు, కేకలు వేయగా చుట్టుపక్కల మత్స్యకారులు, రైతులు అక్కడికి చేరుకొని 108 వాహనంలో ఆత్మకూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం మహబూబ్‌నగర్ ఆస్పత్రికి తీసుకెళ్లారు.

మార్కెట్ కమిటీలపై గురి



అచ్చంపేట వ్యవసాయ మార్కెట్ కార్యాలయం

- ఇప్పటికే పేర్లు ఖరారైనట్లు ప్రచారం
- ఉమ్మడి జిల్లాలో 19 వ్యవసాయ మార్కెట్లు

అచ్చంపేట: నామినేటెడ్ పదవుల పందేరం మళ్లీ మొదలైంది. జిల్లాలో నాగర్‌కర్నూల్, అచ్చంపేట, కల్వకుర్తి, కొల్లాపూర్ వ్యవసాయ మార్కెట్లు ఉండగా.. పాలకవర్గాలు ఖాళీగా ఉన్నాయి. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఈ ఏడాది ఫిబ్రవరి 12న వ్యవసాయ మార్కెట్ కమిటీలు రద్దు చేసింది. వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు కొత్త కమిటీల నియామకానికి ఉత్తర్వులు జారీ చేశారు. ఆయా మార్కెట్ కమిటీ చైర్మన్ల పదవులకు రొటేషన్ పద్ధతిలో ప్రభుత్వం రిజర్వేషన్ ఖరారు చేసింది. వెంటనే వీటి నియామకానికి అవసరమైన ప్రతిపాదనలను ఎమ్మెల్యేల నుంచి ఆహ్వానిస్తూ.. ఉత్తర్వులు విడుదల చేసింది. ఎమ్మెల్సీ, పార్లమెంట్ ఎన్నికలు రావడంతో పాలకవర్గాల నియామకంలో తాత్సారం జరిగింది. నామినేటెడ్ పోస్టుల్లో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పోస్టు కీలకం. ఎమ్మెల్యే తర్వాత ఆ స్థాయిలో నియోజకవర్గంలో ప్రోటోకాల్ కలిగిన పోస్టు కావడంతో ఆశావహుల్లో సందడి నెలకొంది. కాంగ్రెస్‌లో క్రియాశీలకంగా వ్యవహరించిన వారు ఈ పోస్టులపై కన్నేసి సీనియర్, జూనియర్ నేతలు పైరవీలు మొదలుపెట్టారు.

ఇప్పటికే ప్రతిపాదనలు

మార్కెట్ కమిటీలకు సంబంధించి ఎమ్మెల్యేల ప్రతిపాదనలను ప్రభుత్వం పరిగణలోకి తీసుకుంటోంది. కాంగ్రెస్ నుంచి పలువురు ఈ పదవులను ఆశిస్తున్నారు. గత ప్రభుత్వం మార్కెటింగ్‌శాఖ అధికారులు ప్రకటించిన రిజర్వేషన్ ప్రకారం రెండు సంవత్సరాలకు నాగర్‌కర్నూల్(బీసీ), అచ్చంపేట (ఓసీ మహిళ), కల్వకుర్తి(ఓసీ), కొల్లాపూర్(ఓసీ)కి రిజ్వరు చేశారు. అయితే వారు ఎన్నికైన తర్వాత ప్రభుత్వం మారడంతో మార్కెట్ కమిటీల రద్దు అనివార్యంగా మారింది. ఇప్పుడు రొటేషన్ పద్ధతిలో నాగర్‌కర్నూల్(ఓసీ మహిళ), అచ్చంపేట(ఎస్సీ మహిళ), కల్వకుర్తి (బీసీ మహిళ), కొల్లాపూర్(ఎస్టీ) కేటాయిస్తారు. ఇందుకు సంబంధించిన ప్రతిపాదనలు ఇప్పటికే ప్రభుత్వానికి చేరినట్లు తెలుస్తోంది. ప్రధానంగా ఇతర పార్టీల నుంచి కాంగ్రెస్‌లోకి వచ్చిన వారిని కాకుండా.. ముందు నుంచి పార్టీకి విధేయులుగా ఉన్నవారిని నామినేటెడ్ పదవులకు సంబంధించి పేర్లు పరిగణలోకి తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. ఏదేమైనా కొద్ది రోజుల్లోనే మార్కెట్ కమిటీలకు సంబంధించి ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు రానున్నట్లు పార్టీ వర్గాల్లో ప్రచారం సాగుతోంది.

ప్రస్తుతం 16 వ్యవసాయ మార్కెట్లు..

ఉమ్మడి జిల్లాలో 19 వ్యవసాయ మార్కెట్లు ఉండగా.. షాద్‌నగర్, ఆమనగల్లు, కొడంగల్ రంగారెడ్డి, వికారాబాద్ జిల్లాలోకి వెళ్లాయి. ప్రస్తుతం 16 మార్కెట్లు పనిచేస్తున్నాయి. వ్యవసాయ మార్కెట్ కమిటీల్లో రిజర్వేషన్లు ఇలా అమలు కానున్నాయి. నాగర్‌కర్నూల్, మక్తల్ (ఓసీ మహిళ), అచ్చంపేట(ఎస్సీ), కొల్లాపూర్(ఎస్టీ), కల్వకుర్తి, దేవకద్ర (బీసీ మహిళ), మహబూబ్‌నగర్, వనపర్తి, పెబ్బేరు, గద్వాల, అలంపూర్, నవాబ్‌పేట(బీసీ), అత్మకూర్, బాదేపల్లి(ఓసీ జనరల్) మదనాపూర్, నారాయణపేట, కోస్గి(ఎస్సీ)లకు రొటేషన్ పద్ధతిలో కేటాయించారు. ఈ మేరకు పదవులు దక్కించుకునేందుకు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు.

అనుచరుల ద్వారా..

మార్కెట్ కమిటీ చైర్మన్ల ఎంపిక స్థానిక ఎమ్మెల్యేల నిర్ణయమే కీలకంగా ఉంటుంది. మార్కెట్ కమిటీ చైర్మన్, డైరెక్టర్ పదవులపై ఆశపెట్టుకున్న నాయకులు, వ్యాపారులు ఇప్పటికే తమ అనుచరల ద్వారా తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. గతంలో చైర్మన్ పదవిలో రాజకీయ పలుకుబడితో పాటు ఆర్థికంగా ఉన్నవారినే ఎంపిక చేసేవారు. అయితే ఇప్పుడు ఎలాంటి వారికి ప్రాధాన్యత ఇస్తారో.. ఎవరిని ఎంపిక చేస్తారో వేచి చూడాలి.

మారిన రిజర్వేషన్

గత ప్రభుత్వం 2018 ఏప్రిల్ 30న మార్కెట్ కమిటీల నియామకంలో మార్పులు తీసుకొచ్చింది. రొటేషన్ పద్ధతిలో రిజర్వేషన్లను అమలు చేయాలని రాష్ట్ర మార్కెటింగ్‌శాఖ నిర్ణయించి అమలు చేసింది. తొలిసారి ఏడాదికే పదవీకాలం ముగియగా.. వాటిని పునరుద్ధరించడంలో జాప్యం చేసింది. తరువాత చైర్మన్ల పదవిని రెండేళ్ల కాలానికి పెంచింది. ఈ ప్రభుత్వం ఆదే నిబంధనల్ని, రొటేషన్ విధానాన్ని అనుసరించి రెండేళ్ల పదవీ కాలానికి చైర్మన్ల నియామకం చేపట్టేందుకు నిర్ణయించింది. మార్కెటింగ్ శాఖ చట్టం 1966 నోటిఫికేషన్ ప్రకారం ప్రతి మార్కెట్‌లో చైర్మన్, వైస్‌చైర్మన్లతో కలిపి 14 మంది సభ్యులు ఉండాలి. గత ప్రభుత్వం రిజర్వేషన్ విధానం అమలు చేసి పాలకవర్గంలో 18 మంది సభ్యులకు పెంచింది. వీరిలో 12 మంది వ్యవసాయదారుల్లో ఒకరిని చైర్మన్‌గా నియమించాల్సి ఉంటుంది. వారందరినీ నామినేట్ చేయాల్సి ఉంటుంది. కమిటీలో ఎస్టీ, ఎస్సీ, బీసీ, మహిళలు, లైసెన్స్ వ్యాపారులు ఇద్దరు, మిగిలిన నలుగురు ఎక్స్‌ఫీషియో సభ్యులు ఉండాలి. కమిటీలో చిన్న, సన్నకారు, పాడి రైతులకు ప్రాధాన్యత ఇవ్వాల్సి ఉంటుంది.

గద్వాలలో భారీ చోరీ


చిందరవందరగా పడేసిన బీరువాలోని దుస్తులు


బాధిత కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి

- 30 తులాల బంగారు ఆభరణాలు, 15 తులాల వెండి, రూ.3.50 లక్షల నగదు అపహరణ
- కేసు నమోదు
- బాధిత కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి

గద్వాల క్రైం: గుర్తు తెలియని దుండగులు ఇంట్లోకి చొరబడి 30 తులాల బంగారు ఆభరణాలు, 15 తులాల వెండి, రూ.3.50 లక్షల నగదు ఎత్తుకెళ్లిన సంఘటన గద్వాల పట్టణంలో చోటుచేసుకుంది. బాధితులు, పోలీసుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. వేదనగర్ కాలనీకి చెందిన ప్రతాప్ కుటుంబ సభ్యులతో కలిసి గురువారం ఉదయం కర్నూల్ జిల్లాలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో వైద్యం నిమిత్తం ఇంటికి తాళం వేసి వెళ్లారు. ఈ క్రమంలో గుర్తుతెలియని దుండగులు తాళం ధ్వంసం ఇంట్లోకి చొరబడి బీరువాలో భద్రపరిచిన బంగారు, వెండి ఆభరణాలు, నగదు ఎత్తుకెళ్లారు. వైద్యం అనంతరం రాత్రి ఇంటికి వచ్చి చూడగా.. తాళం ధ్వంసం చేసి ఉండటం, ఇంట్లోని వస్తువులు, సామగ్రి చిందరవందరగా పడి ఉండటంతో చోరీ జరిగినట్లు గుర్తించి పోలీసులకు సమాచారం అందించామన్నారు. శుక్రవారం ఉదయం క్లూస్ టీం, డాగ్‌స్క్వాడ్ పలు ఆధారాలను సేకరించారు. పెద్ద మొత్తంలో దొంగతనం జరగడంతో కాలనీవాసులు భయాందోళనకు గురయ్యారు. బాధితుడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసకున్నట్లు ఎస్‌ఐ శ్రీనివాస్ తెలియజేశారు. చోరీ జరిగిన విషయం తెలుసుకున్న ఎంపీ మల్లురవి, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ సరిత బాధిత కుటుంబసభ్యులను ఓదార్చారు. వీలైనంత త్వరగా నిందితులను గుర్తించి బాధితులకు న్యాయం చేయాలన్నారు. పోలీస్ శాఖపై నమ్మకం కలిగేలా విధులు నిర్వహించాలన్నారు.

పోలీసుల వైఫల్యం..

జిల్లా కేంద్రంలో ప్రతాప్ ఇంట్లో చోరీ జరిగినట్లు తెలుసుకున్న ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి వారిని పరామర్శించి మాట్లాడారు. గద్వాల నియోజకవర్గంలో గద్వాల, గట్టు మండలాల్లో వారం రోజుల నుంచి వరుస చోరీలు కొనసాగుతున్నా.. పోలీసులు పట్టించుకోవడంలేదన్నారు. నిత్యం పెట్రోలింగ్, గస్తీ, తనిఖీలు చేపడుతున్నట్లు చెప్పడం తప్పా.. మరేమి లేదన్నారు. పోలీసు వ్యవస్థ నిద్రావస్థలో ఉందన్నారు.

మాగనూరులో రెండు చోట్ల

మాగనూర్: మండల పరిధిలోని వర్కూర్‌లో శుక్రవారం తెల్లవారుజామున ఓ ఇంట్లో చోరీ జరిగింది. ఎస్‌ఐ మహ్మద్ అబ్దుల్‌ఖాదర్ తెలిపిన వివరాలు ఇలా.. గ్రామానికి చెందిన సుజాత మూడు రోజుల క్రితం తన బావ లక్ష్మారెడ్డి మృతి చెందగా, దినాల కార్యక్రమం కోసం వెళ్లింది. దీంతో గుర్తుతెలియని వ్యక్తులు ఇంటి తాళం పగలగొట్టి బీరువాలోని 9 తులాల బంగారం, రూ.10 వేలు నగదు ఎత్తుకెళ్లారు. బాధితురాలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. అదేవిధంగా కొల్పూర్ గ్రామంలో వెలసిన గ్రామ దేవత గజ్జలమ్మవ్వ ఆలయంలో గుర్తు తెలియని వ్యక్తులు బంగారు అభరణాలు ఎత్తుకెళ్లినట్లు గ్రామస్తులు తెలిపారు. రోజు మాదిరిగానే ఆలయంలో పూజలు చేసేందుకు పూజారులు శుక్రవారం ఉదయం ఆలయానికి వచ్చారు. అప్పటికే ఆలయ తాళాలు పగలగొట్టి ఉండటాన్ని గమనించి గ్రామస్తులకు సమాచారం ఇచ్చారు. ఆలయంలో పరిశీలించగా అమ్మవారి తాళిబొట్టును ఎత్తుకెళ్లినట్లు గుర్తించారు.

దేవరకద్రకు డిగ్రీ కళాశాల మంజూరు

ఎమ్మెల్యేకు జీఓ కాపీ అందజేసిన ఉప ముఖ్యమంత్రి భట్టి


జీఓ కాపీని ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డికి అందజేస్తున్న ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

దేవరకద్ర: దేవరకద్రకు ప్రభుత్వ డిగ్రీ కళాశాల మంజూరైంది. శుక్రవారం హైదరాబాద్‌లోని రాష్ట్ర సచివాలయంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, విద్యాశాఖ ప్రధానకార్యదర్శి బుర్రా వెంకటేశం ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డికి జీఓ కాపీని అందజేశారు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన నాటినుంచి డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని విద్యార్థులతో పాటు వారి తల్లిదండ్రులు కోరుతుండగా.. ఎట్టకేలకు అందరి కల నెరవేరింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కళాశాల మంజూరు చేసిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఆర్థిక అనుమతులు ఇచ్చిన ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో తాండూర్ ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి, టీపీసీసీ అధికార ప్రతినిధి గాల్‌రెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అలంపూర్ ఆలయాలను పరిశీలించిన డీఐఈఓ


ఆలయ ఈఓతో మాట్లాడుతున్న డీఐఈఓ హృదయరాజు

జోగుళాంబ శక్తిపీఠం: కలెక్టర్ సంతోష్ ఆదేశాల మేరకు జిల్లా ఇంటర్మీడియట్ నోడల్ అధికారి (డీఐఈఓ) హృదయరాజు శుక్రవారం అలంపూర్ జోగుళాంబ బాలబ్రహ్మేశ్వరస్వామి ఆలయాలను పరిశీలించారు. ఆయా ఆలయాలు అభివృద్ధికి ఎందుకు దూరంగా ఉన్నాయి.. సౌకర్యాల కొరత, సమస్యల గురించి ఆరా తీశారు. ఈఓ పురేందర్‌తో సమావేశమయ్యారు. అనంతరం మాట్లాడుతూ.. ఆలయాల అభివృద్ధికి దాతలు సహకరించేందుకు స్వచ్ఛందంగా ముందుకొస్తున్నారన్నారు. అయితే ఆలయాలు కేంద్ర పురావస్తుశాఖ పరిధిలో ఉండటంతో అభివృద్ధి పనులకు అనుమతులు లభించడం లేదన్న విషయాన్ని గుర్తించామని.. మరింత లోతైన అధ్యాయనం చేసి పూర్తి నివేదికను కలెక్టర్‌కు అందజేస్తామని చెప్పారు.

‘తుంగభద్ర’లో ఇసుక వివాదం

- గద్వాల జిల్లా ట్రాక్టర్లను నిలిపిన ఏపీ అధికారులు
- అక్కడి సరిహద్దులో ఇసుక తీసినందుకు జరిమానా
- మన ఇసుక వాహనం ట్రాక్టర్ యజమానుల ఆందోళన


గద్వాల జిల్లా ట్రాక్టర్లను నిలిపివేసిన ఏపీ అధికారులు

రాజోళి: ఆంధ్రప్రదేశ్-తెలంగాణ మధ్యలో ఉన్న తుంగభద్ర నదిలో మరోసారి ఇసుక వివాదం తలెత్తింది. అయితే వివాదం ముదరకుండా అధికారులు, పోలీసులు సామరస్య ధోరణితో వ్యవహరించడంతో జరిమానాతో ముగిసింది. వివరాల్లోకి వెళ్తే.. జోగుళాంబ గద్వాల జిల్లాలోని ప్రజలు, ప్రభుత్వ అవసరాలకు మండలంలోని తూర్పుగార్లపాడు సమీపంలో ఉన్న తుంగభద్ర నది నుంచి ఇసుక తరలించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. దీంతో మన ఇసుక వాహనం ద్వారా జిల్లా ప్రజలకు ఇసుక అందిస్తున్నారు. రోజులాగే శుక్రవారం ఇసుక కోసం నదిలోకి వెళ్లిన ట్రాక్టర్లను ఏపీ అధికారులు నిలిపివేశారు. సరిహద్దు దాటి వచ్చి ఇసుక తీసుకుంటున్నారని కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. దీంతో ట్రాక్టర్ల డ్రైవర్లు, యజమానులు వెంటనే జిల్లా మైనింగ్ పోలీస్, రెవెన్యూ అధికారులకు సమాచారమిచ్చారు. వారు నది వద్దకు చేరుకునే వరకే 64 ట్రాక్టర్లకు ఒక్కో ట్రాక్టర్‌కు రూ.5 వేల చొప్పున జరిమానా విధించారు. ప్రభుత్వ అనుమతులు ఉండి, నెలల తరబడి ఇదే పద్ధతిలో ఇసుక తీస్తున్నా కూడా.. ఏపీ ప్రభుత్వానికి ఎలాంటి జరిమానాలు చెల్లించలేదని, కొత్తగా సరిహద్దు దాటారనే నెపంతో ఇలా జరిమానాలు విధించడం ఏమిటని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

బైక్‌ను ఢీకొన్న కారు: ఒకరికి తీవ్ర గాయాలు

ఎర్రవల్లిచౌరస్తా: బైక్‌ను కారు ఢీకొనగా వ్యక్తికి తీవ్ర గాయాలైన ఘటన శుక్రవారం చోటు చేసుకుంది. ఇటిక్యాల ఎస్‌ఐ వెంకటేష్, స్థానికుల కథనం మేరకు.. మండలంలోని కొండేరుకు చెందిన కటిక బాషా పనినిమిత్తం తన బైక్‌పై ఎర్రవల్లి చౌరస్తాకు వెళ్లి తిరిగి స్వగ్రామానికి బయలుదేరాడు. ఈ క్రమంలో జాతీయ రహదారిపై కొండేరు స్టేజీలో గ్రామం వైపు రోడ్డు దాటుతుండగా హైదరాబాద్ నుంచి కర్నూల్ వైపు వెళ్తున్న కారు అతివేగంతో వచ్చి వెనుక నుంచి బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కటిక బాషాకు తీవ్ర గాయాలు కాగా గమనించిన స్థానికులు అంబులెన్స్ ద్వారా కర్నూల్‌కు తరలించారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

జూరాలకు తగ్గిన వరద


జూరాల ప్రాజెక్టులో ప్రస్తుత నీటిమట్టం

ధరూరు: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు ఎగువ నుంచి వస్తున్న వరద తగ్గుముఖం పట్టినట్లు పీజేపీ అధికారులు తెలిపారు. శుక్రవారం ప్రాజెక్టుకు 1,040 క్యూసెక్కుల వరద రాగా.. నెట్టెంపాడు ఎత్తిపోతల పథకానికి 750 క్యూసెక్కులు, భీమా లిఫ్ట్-1కు 650, కోయిల్ సాగర్‌కు 315, భీమా లిఫ్ట్-2కు 146, సమాంతర కాల్వకు 342, ఆవిరి రూపంలో 140 క్యూసెక్కులు మొత్తం 2,197 క్యూసెక్కులు వినియోగించినట్లు వివరించారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 9.657 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం 8.929 టీఎంసీల నీటి నిల్వ ఉందన్నారు.

రామన్‌పాడులో నిలకడగా..

మదనాపురం: మండలంలోని రామన్‌పాడు జలాశయంలో నీటిమట్టం నిలకడగా ఉందని ఏఈ సింగిరెడ్డి రజీల్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం ప్రాజెక్టులో 1,019 అడుగుల నీటి మట్టం ఉండగా.. జూరాల సమాంతర కాల్వ నుంచి 342 క్యూసెక్కుల నీరు చేరుతుండగా, ఎడమ కాల్వ నుంచి నీటిసరఫరా లేదని చెప్పారు. తాగునీటి అవసరాలకు రోజుకు 20 క్యూసెక్కులు వినియోగిస్తున్నామని చెప్పారు.

శ్రీశైలంలో 814.8 అడుగులు..

దోమలపెంట: శ్రీశైలం జలాశయంలో శుక్రవారం 814.8 అడుగుల నీటిమట్టం, 37.2470 టీఎంసీల నీటి నిల్వ ఉంది. సుంకేసుల నుంచి 449 క్యూసెక్కుల వరద జలాశయానికి చేరుతుండగా.. 71 క్యూసెక్కుల నీరు ఆవిరైంది.

ఫోర్జరీ కేసులో నిందితుడికి జైలు శిక్ష

అలంపూర్ రూరల్: సంతకం ఫోర్జరీ చేసిన కేసులో నిందితుడు రామకృష్ణారెడ్డికి రెండేళ్ల జైలుశిక్ష, రూ.2,500 జరిమానా విధిస్తూ అలంపూర్ జూనియర్ సివిల్ న్యాయమూర్తి కమలాపురం కవిత తీర్పునిచ్చినట్లు ఎస్‌ఐ నాగరాజు శుక్రవారం తెలిపారు. ఆయన కథనం మేరకు.. మండలంలోని లింగన్‌వాయికి చెందిన షేక్షావలి అదే గ్రామానికి చెందిన రామకృష్ణారెడ్డికి రూ.2 లక్షలు అప్పుగా ఇచ్చారు. తిరిగి డబ్బులు చెల్లించకపోవడంతో షేక్షావలి నంద్యాల కోర్టులో రామకృష్ణారెడ్డిపై కేసు వేశారు. విషయం తెలుసుకున్న రామకృష్ణారెడ్డి షేక్షావలి పేరున ఉన్న 3 ఎకరాల భూమిని రూ.6 లక్షలకు కొని రూ.4.50 లక్షలు ఇచ్చినట్లు.. మిగిలిన రూ.1.50 లక్షలు ఇవ్వాల్సి ఉన్నట్లు ఫోర్జరీ సంతకాలతో తప్పుడు డాక్యుమెంట్ సృష్టించి గద్వాల కోర్టులో కేసు వేశారు. ఇది గమనించిన షేక్షావలి తన సంతకాలు ఫోర్జరీ చేసి తప్పుడు డాక్యుమెంట్ సృష్టించి అధికారులను తప్పుదోవ పట్టించారని అలంపూర్ కోర్టులో కేసు వేశారు. శుక్రవారం ఇరువురి వాదనలు విన్న న్యాయమూర్తి రామకృష్ణారెడ్డికి రెండేళ్ల జైలుశిక్ష, రూ.2,500 జరిమానా విధిస్తూ తీర్పునిచ్చిందని ఎస్‌ఐ వివరించారు.

హ్యాండ్‌బ్యాగ్‌లో నుంచి బంగారు బిస్కెట్..

కొత్తకోట రూరల్: బస్సు ఎక్కుతున్న మహిళ హ్యాండ్ బ్యాగులో నుంచి బంగారు బిస్కెట్‌ను గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేసిన సంఘటన గురువారం కొత్తకోట బస్టాండ్‌లో చోటుచేసుకుంది. ఎస్‌ఐ మంజునాథ్‌రెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. వనపర్తి జిల్లా కేంద్రానికి చెందిన జాయినోజు సునీత తన వద్ద ఉన్న బంగారు బిస్కెట్‌ను హైదరాబాద్‌లో తెలిసిన దుకాణంలో ఇచ్చి బంగారు గాజులు తెచ్చుకుందాం అనుకుంది. ఈ క్రమంలో గురువారం ఉదయం వనపర్తి నుంచి హైదరాబాద్‌కు వెళ్లేందుకు వనపర్తి బస్టాండ్‌లో ఆర్టీసీ బస్సు ఎక్కి కొత్తకోటలో దిగింది. కొత్తకోట బస్టాండ్‌లో దిగిన వెంటనే హైదరాబాద్ వెళ్లే బస్సు రావడంతో ప్రయాణికులు ఎక్కువగా ఉండటంతో హడావుడిగా బస్సు ఎక్కింది. గంట తర్వాత బస్సు జడ్చర్లకు చేరుకోగానే హ్యాండ్‌బ్యాగ్‌లో బంగారు బిస్కెట్‌ను చూసుకోగా.. బంగారం బిస్కెట్ కనిపించకపోవడంతో ఆందోళనకు గురైంది. కొత్తకోట బస్టాండ్‌లో బస్సు ఎక్కుతున్న క్రమంలో హ్యాండ్ బ్యాగ్‌లోని 32గ్రాముల బంగారు బిస్కెట్‌ను గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేసి ఉంటారని శుక్రవారం కొత్తకోట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. బాధిత మహిళ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్‌ఐ తెలియజేశారు.

టోల్‌గేట్ పనులు అడ్డుకున్న గ్రామస్తులు


పనులు అడ్డుకుంటున్న రైతులు

గండేడ్: మండలంలోని అంచన్‌పల్లి గేట్ వద్ద జాతీయ రహదారిపై ఏర్పాటు చేస్తున్న టోల్‌గేట్ పనులను శుక్రవారం రైతులు అడ్డుకున్నారు. వివరాల్లోకి వెళ్తే.. మహబూబ్‌నగర్ జిల్లా భూత్పూర్ నుంచి మన్నెకల్లి వరకు 192 కిలోమీటర్ల జాతీయ రహదారి నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం రూ.709 కోట్లు మంజూరు చేశారు. భూత్పూర్ నుంచి దుద్యాల్ వరకు మొదటి ప్యాకేజీ పనులు కొనసాగుతున్నాయి. రోడ్డు నిర్మాణ పనులు దాదాపు పూర్తికాగా.. కల్వర్టులు, టోల్‌గేట్ రీ-అలైన్‌మెంట్ పనులు పెండింగ్‌లో ఉన్నాయి. శుక్రవారం అంచన్‌పల్లి గేట్ వద్ద టోల్‌గేట్ పనులు ప్రారంభించగా తమ పొలంలో పనులు చేపట్టరాదని రైతులు అడ్డుకున్నారు. రోడ్డుకు ఇరువైపులా సమానంగా భూమి తీసుకోవాల్సి ఉండగా.. కేవలం తమ భూమినే ఎందుకు తీసుకుంటారని అభ్యంతరం వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న తహసీల్దార్ నాగలక్ష్మి అక్కడికి చేరుకొని రైతులతో మాట్లాడారు. ఇది కేంద్ర ప్రభుత్వ ప్రతిపాదనని అడ్డుకోవద్దని కోరారు. ఇందుకు సంబంధించిన పరిహారం అందజేస్తామని పేర్కొన్నారు. పోలీసులు రంగంలోకి దిగి పనులు నిలుపొద్దని.. సమస్యలు, అభిప్రాయాలను లిఖితపూర్వకంగా ఇవ్వాలని కోరారు. అయినా వారు ఒప్పుకోకపోవడంతో పనులు నిలిపివేశారు. కాంగ్రెస్‌పార్టీ మండల అధ్యక్షుడు జితేందర్‌రెడ్డి, కార్యనిర్వాహక అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, అధికారులు, పోలీసులు కాంట్రాక్టర్‌తో మాట్లాడారు. వారం గడువు ఇవ్వాలని కోరడంతో సమస్య సద్దుమణిగింది.

మందుగుండు సామగ్రి ఎత్తుకెళ్లిన వ్యక్తులకు రిమాండ్


చోరీకి పాల్పడిన నిందితులు

వెల్దండ: మండల కేంద్రంలోని స్టోన్ క్రషర్‌లో మందుగుండు సామగ్రి ఎత్తుకెళ్లిన వారిని శుక్రవారం రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ రవి తెలిపారు. రంగారెడ్డి జిల్లా రాంనూతల చెందిన వరికుప్పల కుమార్, వరికుప్పల ఈదమయ్య, వరికుప్పల శేఖర్, విఠాయిపల్లికి చెందిన దేరంగుల నర్సింహ, మంచాల మండలం అరుట్లకు చెందిన వరికుప్పల బాబు ఈనెల 16న మండలంలోని శ్రీవెంకటేశ్వర స్టోన్‌క్రషర్‌లో 3వేల జెలటిన్ స్టిక్స్, వెయ్యి ఫూసాలను ఎత్తుకెళ్లారు. కల్వకుర్తి డీఎస్పీ, వెల్దండ సీఐ, ఎస్‌ఐలు టెక్నికల్ ఆధారాలతో నిందితులను గుర్తించి విచారించారు. వరికుప్పల శేఖర్ పరారీలో ఉండగా, మిలిగిన నలుగురిని కల్వకుర్తి కోర్టుకు హాజరుపరచి రిమాండ్ చేసినట్లు ఎస్‌ఐ వివరించారు.

ప్రమాదవశాత్తు జారిపడి వ్యక్తి మృతి

జడ్చర్ల: కల్వర్టు వద్ద జారిపడి వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలోని బండమీదిపల్లిపల్లి సమీపంలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ చంద్రమోహన్ తెలిపిన వివరాల ప్రకారం.. కావేరమ్మపేటకు చెందిన పెద్దగొల్ల నాగరాజు(40) ఈనెల 19న కూలీ పనులకు ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. ఆయన కోసం వెతికినా ప్రయోజనం లేకపోయింది. శుక్రవారం బండమీదిపల్లి సమీపంలోని కల్వర్టు వద్ద నాగరాజు మృతదేహాన్ని గుర్తించారు. మృతుడి భార్య బౌరమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.





శుక్రవారం ఏపీ అసెంబ్లీలో ఎమ్మెల్యేలుగా ప్రమాణం చేస్తున్న సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్, మాజీ సీఎం వైఎస్ జగన్

కొలువుదీరిన ఏపీ కొత్త శాసనసభ

- సీఎం సహా మంత్రులు, ఎమ్మెల్యేల ప్రమాణ స్వీకారం
- తొలి రోజే ప్రతిపక్ష నేత వైఎస్ జగన్‌ను అగౌరవపర్చిన ప్రభుత్వం
- సీఎం తర్వాత విపక్ష నేత ప్రమాణ స్వీకారం చేయడం సభ సంప్రదాయం
- ఆ సంప్రదాయాన్ని కాదని మంత్రుల తర్వాత విపక్ష నేత జగన్‌కు అవకాశం
- 2019లోబాబుకు సముచిత గౌరవం కల్పించిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం

సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లో కొత్త శాసన సభ కొలువుదీరింది. 16వ శాసన సభ సమావేశాలు శుక్రవారం ఉదయం 9:46 గంటలకు ప్రారంభం అయ్యాయి. రెండు రోజులపాటు జరిగే ఈ సమావేశాల్లో తొలి రోజు శాసన సభ్యుల ప్రమాణ స్వీకారం జరిగింది. శనివారం అసెంబ్లీ స్పీకర్ ఎన్నిక జరుగుతుంది. తొలిరోజే ప్రభుత్వం సభా సంప్రదాయాలను తుంగలో తొక్కింది. ప్రతిపక్ష నేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని అగౌరవపర్చింది. వాస్తవంగా ముఖ్యమంత్రి ప్రమాణ స్వీకారం చేసిన తర్వాత ప్రతిపక్ష నేతకు అవకాశం కల్పించాలి. ఆ తర్వాత ఉప ముఖ్యమంత్రి, మంత్రులు, ఇతర ఎమ్మెల్యేలు ప్రమాణ స్వీకారం చేయాలి. అయితే, ప్రతిపక్ష నేతకు సముచిత గౌరవం ఇవ్వకుండా మంత్రులందరూ ప్రమాణం చేసిన తర్వాత చివర్లో ప్రమాణం చేయించింది. తద్వారా ముస్ముందు ప్రతిపక్షం పట్ల తన వైఖరి ఏ విధంగా ఉండబోతోందో మొదటిరోజే స్పష్టంగా తెలియజెప్పింది. సీట్ల సంఖ్య ఎలా ఉన్నా 40 శాతం ఓట్లతో అత్యంత బలమైన పార్టీగా వైఎస్సార్‌సీపీ ఉంది. ఆ పార్టీకి ఉన్న ప్రజా బలాన్ని కూడా ప్రభుత్వం విస్మరించింది. 2019లో కొత్త అసెంబ్లీ కొలువుదీరినప్పుడు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అప్పటి విపక్ష నేత చంద్రబాబును సముచితంగా గౌరవించింది. అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ తర్వాత ప్రతిపక్ష నేతగా ఉన్న చంద్రబాబుతో ప్రమాణం చేయించింది. ఆ తర్వాతే ఉప ముఖ్యమంత్రులు, మంత్రులు, మిగిలిన సభ్యులు ప్రమాణం చేశారు. ప్రతిపక్ష నేతకు గౌరవం ఇవ్వాలనే సదుద్దేశంతో అప్పట్లో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చంద్రబాబు చేత సీఎం తర్వాత ప్రమాణం చేయించి గౌరవించింది. ఇప్పుడు ప్రతిపక్ష హోదా లేదనే సాకుతో టీడీపీ ప్రభుత్వం మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌ను మంత్రులందరి తర్వాత ప్రమాణం చేయించి సభా సంప్రదాయాలను కాలరాసింది. నిజానికి ప్రతిపక్ష హోదాకు 10 శాతం సభ్యులు ఉండాలనే నిబంధనం ఏ చట్టంలోనూ లేదని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. లోక్‌సభ తొలి స్పీకర్ మావలంకర్ సభలో ఇచ్చిన రూలింగ్‌ను కొన్ని రాజకీయ పార్టీలు అవసరార్థం వాడుకుంటున్నాయి. కానీ చాలా రాష్ట్రాలలో అధికారపార్టీలు మాజీ ముఖ్యమంత్రులకు, ప్రతిపక్ష నేతలకు సముచిత గౌరవం ఇస్తూ సత్సాంప్రదాయాలను పాటిస్తున్నాయి. టీడీపీ ప్రభుత్వం అలాంటి వాటిని తుంగలో తొక్కింది. 2019లో టీడీపీకి వచ్చిన ఎమ్మెల్యే సీట్లు 23 మాత్రమే. అప్పట్లో ఆ పార్టీకి ఇప్పుడు వైఎస్సార్‌సీపీకి వచ్చిన ఓట్లకన్నా తక్కువ ఓట్లే వచ్చాయి. గెలిచిన 23 మంది సభ్యుల్లోనూ ఐదుగురు టీడీపీని వీడి బయటకు వెళ్లిపోయారు. మిగిలిన కొద్ది మందిలో ఇంకొందరు ఆ పార్టీని వీడేలా చేసి, చంద్రబాబుకు ప్రతిపక్ష హోదా లేకుండా చేయాలనుకుంటే అప్పటి ప్రభుత్వానికి పెద్ద కష్టం కాదు. కానీ, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి ఆ ఆలోచన లేకపోవడంతో టీడీపీ సభ్యుల జోలికి వెళ్లకుండా చంద్రబాబుకు అప్పటి ప్రభుత్వం ప్రతిపక్ష నేత గౌరవం ఇచ్చింది. కానీ ఇప్పుడు అందుకు విరుద్ధంగా సభా సాంప్రదాయాలను పక్కనపెట్టి మాజీ ముఖ్యమంత్రిని అవమానపరిచేలా వ్యవహరించిందనే విమర్శలు వినిపిస్తున్నాయి.

అక్షరక్రమంలో సభ్యుల ప్రమాణం

శాసన సభ ప్రొటెం స్పీకర్‌గా నియమితులైన రాజమండ్రి రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి కొత్తగా ఎన్నికైన ఎమ్మెల్యేలతో శుక్రవారం ప్రమాణ స్వీకారం చేయించారు. తొలుత సీఎం చంద్రబాబునాయుడు, తర్వాత డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, ఆ తర్వాత మంత్రులు అక్షర క్రమంలో ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రమాణం చేశారు. ప్రమాణ స్వీకారం అనంతరం సభలోని సభ్యులందరికీ వైఎస్ జగన్ అభివాదం చేశారు. ఆ తర్వాత మహిళా ఎమ్మెల్యేలతో, అనంతరం అక్షర క్రమంలో మిగిలిన ఎమ్మెల్యేలందరితో ప్రొటెం స్పీకర్ ప్రమాణం చేయించారు. మాజీ సీఎం వైఎస్ జగన్ సహా వైఎస్సార్‌సీపీ నుంచి గెలిచిన 11 మంది, జనసేనకు చెందిన 21 మంది, బీజేపీకి చెందిన 8 మంది, టీడీపీకి చెందిన 131 మంది ఎమ్మెల్యేలు మొత్తం 171 మంది ప్రమాణ స్వీకారం చేశారు. మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సహా ఏడుగురు సభ్యులు ఆంగ్లంలో, మిగిలిన వారందరూ తెలుగులో ప్రమాణం చేశారు. టీడీపీకి చెందిన ఆచంట ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ, వినుకొండ ఎమ్మెల్యే జి.వి.ఆంజనేయులు, కాకినాడ ఎమ్మెల్యే వి. వెంకటేశ్వరరావు (కొండబాబు) వ్యక్తిగత కారణాలతో ప్రమాణస్వీకారం చేయలేదు. వీరితో ప్రొటెం స్పీకర్ శనివారం ప్రమాణం చేయిస్తారని తెలిసింది. తొలి రోజు శాసన సభ సమావేశం మొత్తం ప్రమాణ స్వీకారాలతోనే నడిచింది.

అసెంబ్లీలో ఘనంగా జయశంకర్ వర్ధంతి

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర సాధన కోసం జీవితాన్ని అర్పించిన మహనీయుడు ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ అని శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి పేర్కొన్నారు. జయశంకర్ వర్ధంతి సందర్భంగా అసెంబ్లీ కమిటీ హాల్‌లోని జయశంకర్ చిత్రపటానికి పూలమాల వేసి గుత్తా నివాళి అర్పించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో తెలంగాణకు జరుగుతున్న అన్యాయాన్ని నిలదీయడంతో పాటు, ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం చివరి శ్వాస వరకు కొట్లాడారన్నారు. ఈ కార్యక్రమంలో అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, మండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాశ్, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, ఎమ్మెల్సీలు మధుసూదనాచారి, శేరి సుభాష్ రెడ్డి, అసెంబ్లీ సెక్రెటరీ నరసింహాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ భవన్‌లో.. బీఆర్‌ఎస్ కార్యాలయం తెలంగాణ భవన్‌లోనూ జయశంకర్ వర్ధంతి సందర్భంగా పార్టీ నేతలు ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. బండ ప్రకాశ్ తోపాటు మాజీ మంత్రులు మహమూద్ అలీ, జగదీశ్‌రెడ్డి, పార్టీ నేతలు పొన్నాల లక్ష్మయ్య, రావుల చంద్రశేఖర్‌రెడ్డి, బాల్క సుమన్, మన్నె గోవర్ధన్‌రెడ్డి తదితరులు జయశంకర్ విగ్రహానికి పూలమాల వేశారు.

ఎక్స్‌లో పోస్ట్ చేసిన కేటీఆర్, హరీశ్‌రావు

'ఆరు దశాబ్దాల పాటు తెలంగాణను స్వప్నించి, శ్వాసించి మూడు తరాల ఉద్యమకారులకు ప్రేరణగా నిలిచిన మహా వ్యక్తి జయశంకర్' అని కేటీఆర్ 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. 'తెలంగాణ రాష్ట్ర సాధనకు పోరుబాట చూపిన ఉద్యమ నేత, స్వరాష్ట్ర సాధనే ఊపిరిగా బతికిన సిద్ధాంతకర్త జయశంకర్' అని మాజీ మంత్రి హరీశ్‌రావు 'ఎక్స్'లో పేర్కొన్నారు.

నీట్‌పై స్పందించకపోతే కేంద్ర మంత్రులను తిరగనివ్వం

- అక్రమాలపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలి
- ఎన్ఎస్‌యూఐ, యూత్ కాంగ్రెస్ నేతలు బల్మూరి, శివసేనారెడ్డి



ర్యాలీలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ బల్మూరి. చిత్రంలో దానం, అంజన్ కుమార్ తదితరులు

సాక్షి, హైదరాబాద్: నీట్ పరీక్షల్లో అక్రమాల కారణంగా 24 లక్షల మంది విద్యార్థులకు అన్యాయం జరిగిందని, అందుకే కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌లను తెలంగాణలో తిరగనీయబోమని ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.శివసేనారెడ్డిలు హెచ్చరించారు. నీట్ పరీక్షలో అక్రమాలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ దేశవ్యాప్తంగా చేపట్టిన ఆందోళనలో భాగంగా శుక్రవారం ఉదయం గాంధీభవన్ నుంచి ట్యాంక్‌బండ్ అంబేడ్కర్ విగ్రహం వరకు కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో ఎమ్మెల్సీ మహేశ్‌కుమార్‌గౌడ్, పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ టి. జగ్గారెడ్డి, మాజీ ఎంపీ అంజన్‌కుమార్ యాదవ్, ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్, ఎమ్మెల్యే దానం నాగేందర్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం గాంధీభవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వెంకట్, శివసేనాలు మాట్లాడుతూ నీట్ అక్రమాలపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. బిహార్, గుజరాత్, హరియాణాలలో పేపర్ లీక్ అయినట్టు ఆధారాలతో సహా రుజువైందని, అందుకే ఎవరూ పట్టించుకోకూడదన్న ఉద్దేశంతో లోక్‌సభ ఎన్నికల ఫలితాలు వచ్చిన రోజున నీట్ ఫలితాలు విడుదల చేశారని అన్నారు. ఈ పరీక్ష నిర్వహణలో నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ)పై సందేహాలున్నందున ఆ పరీక్షను రద్దు చేసి మళ్లీ నిర్వహించాలని డిమాండ్ చేశారు. నీట్ కారణంగా నష్టపోయిన విద్యార్థులకు న్యాయం జరిగేంతవరకు తాము పోరాడుతామని, ఈనెల 24న పార్లమెంటును ముట్టడిస్తామన్నారు.

ఏపీ శాసనసభ స్పీకర్‌గా అయ్యన్నపాత్రుడు



సాక్షి, అమరావతి: ఏపీ శాసన సభాపతి (స్పీకర్)గా టీడీపీ ఎమ్మెల్యే, మాజీ మంత్రి చింతకాయల అయ్యన్నపాత్రుడు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. స్పీకర్ పదవికి ఆయన ఒక్కరే నామినేషన్ దాఖలు చేయడంతో ఎన్నిక ఏకగ్రీవమైంది. స్పీకర్ ఎన్నికను శనివారం నిర్వహించాలని గవర్నర్ నిర్ణయించారని, నామినేషన్లను కార్యదర్శికి సమర్పించాలని ప్రొటెం స్పీకర్ గోరంట్ల బుచ్చయ్య చౌదరి శుక్రవారం సభకు తెలిపారు. ఆ తర్వాత అయ్యన్నపాత్రుడి తరఫున డిప్యూటీ సీఎం పవన్, మంత్రులు లోకేశ్, అచ్చెన్నాయుడు, నాదెండ్ల, సత్యకుమార్, పయ్యావుల అసెంబ్లీ కార్యదర్శికి నామినేషన్ పత్రాలు సమర్పించారు. ఈ పదవికి ఒక నామినేషనే రావడంతో ఆయన ఎన్నిక ఏకగ్రీవమైంది. శనివారం ఈ విషయాన్ని సభలో ప్రకటిస్తారు.

సీబీఐ దృష్టిలో దస్తగిరి ఓ వీఐపీ

వైఎస్ వివేకా హత్య కేసులో ఎంపీ అవినాశ్ న్యాయవాది వాదనలు

సాక్షి, హైదరాబాద్ : మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో కిరాయి హంతకుడు దస్తగిరి (ఏ4)ని కేంద్ర దర్యాప్తు సంస్థ (సీబీఐ) ఓ నిందితుడిగా కాకుండా వీఐపీలా చూసిందని ఎంపీ అవినాశ్‌రెడ్డి తరఫు న్యాయవాది తెలిపారు. ఇలాంటి దర్యాప్తు సంస్థను ఎన్నడూ చూడలేదని చెప్పారు. హత్య కేసులో అప్రూవర్‌గా మారినందున తనను నిందితుల జాబితా నుంచి తొలగించి సాక్షిగా పరిగణించాలని కోరుతూ దస్తగిరి హైదరాబాద్‌లోని సీబీఐ కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై న్యాయమూర్తి రఘురాం శుక్రవారం వాదనలు చేపట్టారు. సీబీఐ తరఫున అనిల్ తల్వార్ వాదనలు వినిపించారు. కోర్టు అనుమతిస్తే దస్తగిరిని నిందితుల జాబితా నుంచి తొలగించి, సాక్షుల జాబితాలో చేర్చడానికి తమకు అభ్యంతరం లేదన్నారు. అనంతరం అవినాశ్ తరఫు న్యాయవాది ఉమామహేశ్వర్‌రావు వాదనలు వినిపిస్తూ.. ఓ కరుడుగట్టిన హంతకుడు అప్రూవర్‌గా మారినంత మాత్రాన సాక్షిగా పేర్కొనడం ఎంత మాత్రం సమర్థనీయం కాదన్నారు. ఇలాగైతే ఇకపై హత్యలు చేసిన వారంతా అప్రూవర్‌గా మారి శిక్ష లేకుండా బయటకొస్తారని చెప్పారు. ఇది సమాజానికి తప్పుడు సంకేతాలు ఇచ్చినట్లు అవుతుందన్నారు. ఈ దశలో దస్తగిరి న్యాయవాది కల్పించుకొని వీఐపీ అనడంపట్ల అభ్యంతరం వ్యక్తం చేశారు. ముమ్మాటికీ దస్తగిరిని సీబీఐ ఓ వీఐపీలానే చూసిందని ఉమామహేశ్వర్‌రావు పునరుద్ఘాటించారు. నిందితుల న్యాయవాదుల వాదనల సందర్భంగా సీబీఐ న్యాయవాది కలుగజేసుకోవడంపై వారు తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. సీబీఐ వాదించేటప్పుడు తాము జోక్యం చేసుకోలేదన్నారు. తదుపరి విచారణను న్యాయమూర్తి జూలై 5కు వాయిదా వేశారు. న్యాయవాదులు సాయివంశీ, రవీందర్‌రెడ్డి, టీఎల్ నయన్‌కుమార్‌రెడ్డి పలువురు నిందితుల తరఫున వాదించారు.

ఆర్టీసీ ఖాతాలను పునరుద్ధరించండి

పీఎఫ్ అధికారులకు హైకోర్టు ఆదేశం



సాక్షి, హైదరాబాద్: ప్రావిడెంట్ ఫండ్ బకాయిలు చెల్లించడం లేదంటూ స్తంభింపజేసిన టీజీఎస్ ఆర్టీసీ బ్యాంక్ ఖాతాలను వెంటనే పునరుద్ధరించాలని అధికారులను హైకోర్టు ఆదేశించింది. దీనిపై కౌంటర్ దాఖలు చేయాలని ప్రతివాదులకు స్పష్టం చేసి తదుపరి విచారణను జూలై 15కు వాయిదా వేసింది. రూ.940 కోట్ల పీఎఫ్ బకాయిలు పేరుకుపోవడంతో టీజీఎస్ ఆర్టీసీకి చెందిన బ్యాంక్ ఖాతాలను పీఎఫ్ అధికారులు స్తంభింపజేయడం తెలిసిందే. ఈ కారణంగా ఆర్టీసీ రోజువారీ కార్యకలాపాలకు నగదు లేక తీవ్ర ఇబ్బంది పడాల్సి వస్తోందంటూ రవాణా అధికారులు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. పిటిషన్‌పై సీవీ భాస్కర్ రెడ్డి విచారణ చేపట్టారు. టీజీఎస్ ఆర్టీసీ తరఫున అడ్వొకేట్ జనరల్ సుదర్శన్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ.. ఉమ్మడి రాష్ట్రం ఉన్నప్పటి నుంచి పీఎఫ్ బకాయిలున్నాయని స్పష్టం చేశారు. విభజన చట్టాన్ని పరిగణనలోకి తీసుకోకుండా పీఎఫ్ అధికారులు ఒక్క టీజీఎస్ ఆర్టీసీ ఖాతాలను స్తంభింపజేయడం సరికాదన్నారు. ఆర్టీసీ విభజన జరిగినా.. ఈపీఎఫ్ విభజన జరగలేదని వివరించారు. ఇంకా ఏపీఎస్ ఆర్టీసీ పేరుపైనే పీఎఫ్ ఖాతాలున్నాయని వెల్లడించారు. పీఎఫ్ బకాయిలపై ఇరు రాష్ట్రాలు చర్చలు జరుపుతుండగానే అధికారులు ఖాతాలను స్తంభింపజేయడం సమర్థనీయం కాదని వాదించారు. 2014, మార్చి నుంచి 2019, సెప్టెంబర్ వరకు పీఎఫ్ అంచనాల్లోనూ లోపాలున్నట్టు తెలిపారు. పీఎఫ్ నగదు చెల్లింపులో టీజీఎస్ ఆర్టీసీ ఆలస్యం చేయలేదని, ఒకవేళ జరిగినా అది దీర్ఘకాలికం కాదని తెలిపారు. వాదనలు విన్న న్యాయమూర్తి.. కౌంటర్ దాఖలు చేయాలని రీజినల్ పీఎఫ్ కమిషనర్–2, రికవరీ ఆఫీసర్, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్రాంచ్ మేనేజర్‌కు ఆదేశాలు జారీ చేశారు.

నిజాయితీ చాటిన ఆర్టీసీ సిబ్బంది



కొల్లాపూర్: స్థానిక ఆర్టీసీ డిపోకు చెందిన సిబ్బంది తమ నిజాయితీని చాటుకున్నారు. డిపోకు చెందిన బస్సు శుక్రవారం ఉదయం కొల్లాపూర్ నుంచి హైదరాబాద్‌కు బయలుదేరింది. కోడేరు మండలం కదిరెపాడు చెందిన క్యాతం బుద్ధమ్మ అదే బస్సులో హైదరాబాద్ వెళ్లింది. అనుకోకుండా జడ్చర్ల బస్టాండ్‌లో దిగిపోయింది. కొద్దిసేపటి తర్వాత బస్సులో తన వెంట తెచ్చుకున్న బ్యాగు మర్చిపోయినట్లు గుర్తించి, జడ్చర్ల కంట్రోలర్‌కు తెలియజేసింది. ఆయన బస్సు కండక్టర్ వెంకటేష్‌కు ఫోన్‌చేసి సమాచారం తెలియజేశారు. మహిళ కూర్చున్న సీటు వద్ద ఉన్న బ్యాగును గుర్తించి భద్రపర్చారు. బుద్ధమ్మ వేరొక బస్సులో హైదరాబాద్‌కు చేరుకుని ఎంజీబీఎస్‌లో ఆర్టీసీ అధికారుల సమక్షంలో బ్యాగును తీసుకుంది. అందులో రూ.1,51,400 నగదు ఉన్నట్లు ఆర్టీసీ అధికారులు తెలిపారు. బ్యాగును భద్రంగా అప్పగించినందుకు ఆర్టీసీ డ్రైవర్, కండక్టర్‌కు ఆమె కృతజ్ఞతలు తెలిపారు.

విశ్వకర్మ నైపుణ్య శిక్షణ ప్రారంభం



మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జిల్లాకేంద్రంలోని పద్మావతికాలనీ జనశిక్షణ సంస్థాన్‌లో పీఎం విశ్వకర్మ నైపుణ్య శిక్షణ కార్యక్రమాన్ని శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జిల్లా పరిశ్రమల శాఖాధికారి బాబురావు మాట్లాడుతూ విశ్వకర్మ స్కీంలో శిక్షణ కోసం దర్జీ, హెయిర్ డ్రెస్సర్, దోబీ శిక్షణ కోర్సుల కోసం ఎంపిక చేశారన్నారు. ఇందులో దరఖాస్తు చేసుకుని ఎంపికైన వారందరికి వారం రోజుల పాటు శిక్షణ ఇవ్వనున్నట్లు చెప్పారు. శిక్షణ పొందిన వారికి ఐడీ కార్డు లభిస్తుందని, తద్వారా రూ.4 వేల స్టైఫండ్, రూ.15 వేల విలువైన స్కిల్‌చర్‌తో ఎంతో ప్రయోజనం కలుగుతుందన్నారు. ఉపాధి పొందే వారికి రూ.లక్ష బ్యాంకు రుణం సైతం అందిస్తామన్నారు. సంస్థ డైరెక్టర్ సుబ్బారెడ్డి మాట్లాడుతూ ఈ కార్యక్రమం ద్వారా శిక్షణ పొందే వారికి ఎంతో ప్రయోజనం ఉందని, ప్రభుత్వం రూ.కోట్లు ఖర్చు చేసి శిక్షణ ఇస్తుందని, అర్హులైన వారు స్కీంను వినియోగించుకోవాలని సూచించారు.

చెంచు మహిళపై దాడి అమానుషం



చెంచు మహిళ ఈశ్వరమ్మను పరామర్శిస్తున్న ఐద్వా సంఘం రాష్ట్ర కార్యదర్శి మల్లు లక్ష్మి తదితరులు

నాగర్‌కర్నూల్ రూరల్: చెంచు మహిళపై ఇష్టారీతిగా దాడి చేయడం అమానుషమని ఐద్వా సంఘం రాష్ట్ర నాయకురాలు మల్లు లక్ష్మి అన్నారు. జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఈశ్వరమ్మను శుక్రవారం ఆమె పరామర్శించారు. అనంతరం మల్లు లక్ష్మి మాట్లాడుతూ చెంచు మహిళ ఈశ్వరమ్మపై అదే గ్రామానికి చెందిన బండి వెంకటేష్, శివ భూమికి సంబంధించిన డబ్బులు ఇవ్వమని అడిగితే మిగతా రెండున్నర ఎకరాల పొలం ఇవ్వాలని ఆమెపై దాడి చేశారని ఆరోపించారు. వెంటనే అరెస్ట్ చేసి ఆమె కుటుంబాన్ని ఆదుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆమెకు సంబంధించిన 4 ఎకరాల భూమిని రూ.4.50 లక్షలకు తీసుకొని రూ.2 లక్షలు ఇచ్చి మిగతా డబ్బులు ఇవ్వకుండా ఇబ్బంది పెట్టారని, పేపర్‌పై సంతకం చేయించుకొని ఈశ్వరమ్మను నిర్బంధించి దాడి చేశారని దుయ్యబట్టారు. రాష్ట్ర మంత్రి నియోజకవర్గంలోనే ఇలాంటి ఘటనలు జరిగితే మిగతా ప్రాంతాల్లో ప్రజలకు రక్షణ ఎలా ఉంటుందని ప్రశ్నించారు. మంత్రి ఈ విషయంలో జోక్యం చేసుకొని నిందితులను అరెస్ట్ చేయించి బాధిత కుటుంబాన్ని ఆర్థికంగా ఆదుకోవాలని, డబుల్ బెడ్ రూం ఇల్లు ఇవ్వాలని కోరారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఐద్వా జిల్లా కార్యదర్శి కందికొండ గీత, గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి శంకర్‌నాయక్, కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు కాశన్న, నాయకులు అశోక్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

బాధితురాలికి న్యాయం చేయకపోతే ఆందోళన



చెంచు మహిళ ఈశ్వరమ్మను పరామర్శిస్తున్న బీజేపీ మహిళా మోర్చా రాష్ట్ర అధ్యక్షురాలు శిల్పారెడ్డి తదితరులు

నాగర్‌కర్నూల్ క్రైం: కొల్లాపూర్ మండలంలోని మొలచింతలపల్లికి చెందిన చెంచు మహిళ ఈశ్వరమ్మకు న్యాయం చేయకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేపడుతామని బీజేపీ రాష్ట్ర మహిళా మోర్చా అధ్యక్షురాలు శిల్పారెడ్డి అన్నారు. శుక్రవారం జిల్లాకేంద్రంలోని జనరల్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితురాలిని ఆమె పరామర్శించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ కుటుంబ సభ్యులను కూడా బెదిరించి రాక్షసులుగా ప్రవర్తించిన తీరు జుగుప్సాకరంగా ఉందని, విపరీతమైన బాధతో ఆమె మాట్లాడే పరిస్థితిలో కూడా లేదన్నారు. ముఖ్యమంత్రి సొంత జిల్లాలో మహిళలపై జరుగుతున్న దాడులు, అత్యాచారాలు నివారించేందుకు దృష్టిసారించాలని, బాధితులకు న్యాయం చేయాలని, లేకపోతే మహిళా మోర్చా ఆధ్వర్యంలో పోరాటం నిర్వహిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు జానకి, రాష్ట్ర కార్యదర్శి దశరథ లక్ష్మి, జిల్లా ప్రధాన కార్యదర్శి తేజస్విని తదితరులు పాల్గొన్నారు.

పోర్చుగల్‌కు వెళుతున్న క్రీడాకారుడికి సన్మానం



ఖాజ మైనద్దీన్‌ను సన్మానించిన అసోసియేషన్ సభ్యులు

మహబూబ్‌నగర్ క్రీడలు: పోర్చుగల్ దేశం లిస్బన్ సిటీలోని బెనిఫిషియా ఫుట్‌బాల్ క్లబ్ ట్రయల్స్‌కు వెళ్తున్న జిల్లా కేంద్రానికి చెందిన ఖాజా మైనద్దీన్ షాజీబ్‌ను శుక్రవారం ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల మైదానంలో ఘనంగా సన్మానం చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి భాను కిరణ్ మాట్లాడుతూ జిల్లా క్రీడాకారుడు విదేశాల్లో ట్రయల్స్‌కు వెళ్తుండడం గర్వంగా ఉందన్నారు. భవిష్యత్‌లో మరిన్ని విజయాలు సాధించాలని సూచించారు. కార్యక్రమంలో కోచ్ వాజిద్‌అలీ, క్రీడాకారులు పాల్గొన్నారు.

సిగరెట్ల కోసం ఘర్షణ.. కత్తులతో దాడి

మహబూబ్‌నగర్ క్రైం: పాన్‌షాపు వద్ద సిగరెట్ల కోసం జరిగిన చిన్నపాటి ఘర్షణ.. చివరకు కత్తులతో దాడి చేసే వరకు వెళ్లింది. పాలమూరు పట్టణంలో కలకలం రేపిన ఈ ఘటనకు సంబంధించి టూటౌన్ ఎస్ఐ విజయ్‌భాస్కర్ కథనం ప్రకారం.. మహబూబ్‌నగర్‌లోని న్యూటౌన్‌లో ఉన్న పాన్ షాప్ దగ్గరకు షాహిల్ అనే వ్యక్తి శుక్రవారం సాయంత్రం వచ్చి రూ.30 విలువ చేసే సిగరెట్లు తీసుకుని డబ్బులు ఇవ్వకుండా వెళ్లాడు. దీంతో పాన్ షాప్‌లో ఉన్న ఫయాజ్.. రాత్రికి పాన్‌షాప్ నిర్వాహకుడు అవేజ్ దుకాణం దగ్గరకు రాగా.. షాహిల్ డబ్బులు ఇవ్వకుండా సిగరెట్లు తీసుకువెళ్లాడని చెప్పాడు. దీంతో అవేజ్ షాహిల్‌కు ఫోన్ చేసి నిలదీయడంతో షాహిల్ రాత్రి 9 గంటల ప్రాంతంలో అతనితోపాటు అమీన్, ఖలీల్, హడ్డు, సమీర్‌తో కలిసి వచ్చి అవేజ్, అతని సోదరుడు సలాంపై దాడి చేశారు. దీంతో అరబ్‌గల్లీకి చెందిన సోఫియాన్ బిన్ సయ్యద్ అడ్డుకోవడంతో ఐదుగురు కలిసి కత్తులతో అతనిపై దాడి చేయడంతో మూడు చోట్ల గాయాలయ్యాయి. దాడి చేసిన తర్వాత ఐదుగురు అక్కడి నుంచి పరార్ కాగా.. గాయపడిన సయ్యద్‌కు జనరల్ ఆస్పత్రిలో చికిత్స అందించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

అన్యాక్రాంతమైన ఆస్తులను స్వాధీనం చేసుకుంటాం



విజయోత్సవ సభలో మాట్లాడుతున్న ఎంపీ మల్లురవి

- నాగర్‌కర్నూల్ ఎంపీ మల్లురవి

వనపర్తి: బీఆర్‌ఎస్ హయాంలో నియోజకవర్గంలో అన్యాక్రాంతమైన ప్రభుత్వ భూములు, ఆస్తులను స్వాధీనం చేసుకుంటామని నాగర్‌కర్నూల్ ఎంపీ మల్లురవి అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన విజయోత్సవ ర్యాలీ, సభ కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. గడిచిన పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ, బీఆర్‌ఎస్ పార్టీలు ఎన్నిరకాల ప్రలోభాలకు గురిచేసినా, ప్రజలు కాంగ్రెస్ వైపు దన్నుగా నిలబడి తనను గెలిపించడం ఆనందంగా ఉందన్నారు. నాగర్‌కర్నూల్ పార్లమెంట్ నియోజకవర్గంలోని విద్యా, వైద్యం, సాగునీటి రంగాలకు ప్రాధాన్యతనిస్తూ, ప్రజా సంక్షేమం కోసం కృషి చేస్తానన్నారు. కేంద్ర ప్రభుత్వం నుంచి రావాల్సిన నిధులను తీసుకువస్తానన్నారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం సామాన్య పౌరుల హక్కులను కాలరాసేలా పాలన చేసిందని విమర్శించారు. అధికారం ఉందని ప్రజాధనం, ప్రభుత్వ ఆస్తులను ప్రైవేట్ వ్యక్తులకు కట్టబెట్టిందని విమర్శించారు. బీఆర్‌ఎస్ పార్టీ మునిగిపోతున్న నావ అని పోచారం శ్రీనివాస్‌రెడ్డి చేసిన వాఖ్యలను ఈ సందర్భంగా గుర్తుచేశారు. వనపర్తి నియోజకవర్గం అభివృద్ధికి సహకరించాలని ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి ఎంపీని కోరారు. అందుకు ఆయన సానుకూలంగా స్పందించారు. కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్, శ్రీనివాస్‌గౌడ్, మున్సిపల్ చైర్మన్ మహేష్, వైస్ చైర్మన్ కృష్ణ, ఎంపీపీ కిచ్చారెడ్డి, శంకర్‌నాయక్, చందర్, కౌన్సిలర్ బ్రహ్మం పాల్గొన్నారు.

సీఎం అభ్యసించిన పాఠశాల సందర్శన

సీఎం రేవంత్‌రెడ్డి ఉన్నత విద్యను అభ్యసించిన స్థానిక జెడ్పీహెచ్ఎస్ బాలుర ఉన్నత పాఠశాలను ఎంపీ మల్లురవి, ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి సందర్శించారు. రాష్ట్ర వ్యాప్తంగా విద్యాభివృద్ధి కోసం ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోందని, త్వరలోనే ప్రభుత్వ విద్యకు పూర్వ వైభవం రానుందని వారు తెలిపారు. అనంతరం జిల్లాకు కొత్తగా వచ్చిన కలెక్టర్ ఆదర్శ్ సురభిని మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లా అభివృద్ధి, సంక్షేమం కోసం భవిష్యత్ కార్యాచరణ, ప్రణాళికలపై చర్చించారు.

వాహనం ఢీకొని వ్యక్తి మృతి



శివ (ఫైల్)

కొత్తకోట రూరల్: బైక్‌పై వెళ్తున్న ఓ వ్యక్తిని గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందిన ఘటన కొత్తకోట మండలం పాలెం హైవేపై చోటు చేసుకుంది. ఎస్ఐ మంజునాథ్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం పెద్దమందడి మండలం వెల్టూర్ చెందిన శివ, భార్య లావణ్య, పిల్లలతో కలిసి కొన్నేళ్లుగా హైదరాబాద్‌లోని సింగరేణి కాలనీ, సైదబాద్‌లో నివాసం ఉంటున్నారు. శివ డ్రైవర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తుండేవాడు. వెల్టూర్‌లో సొంత వ్యవసాయ పొలాన్ని విక్రయించేందుకు శివ ఇటీవల మండల కేంద్రంలో గల బంధువుల ఇంటికి వచ్చాడు. హైదరాబాద్ నుంచి కొత్తకోట వచ్చి చాలా రోజులు కావడంతో భర్త దగ్గరకు లావణ్య గురువారం కొత్తకోటకు వచ్చింది. గురువారం సాయంత్రం అక్కను చూసివస్తానని భార్యతో చెప్పి కొత్తకోట నుంచి పాలెంకు బైక్‌పై వెళ్లాడు. ఎంతకూ ఇంటికి రాకపోవడంతో పాటు ఫోన్ స్విచ్ఛాఫ్ ఉంది. శుక్రవారం ఉదయం గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి అని ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్ కాగా వెంటనే స్థానిక పోలీస్ స్టేషన్‌కు వెళ్లి వివరాలు తెలిపారు. కొత్తకోట నుంచి పాలెంకు సుమారు రాత్రి 11గంటల సమయంలో శివ తన అక్క వద్దకు వెళ్తుండగా గుర్తు తెలియని వాహనం వెనుక నుంచి బైక్‌ను బలంగా ఢీకొనడంతో తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందినట్లు పోలీసులు ప్రాథమిక నిర్ధారణకు వచ్చారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

బైక్‌ను ఢీకొన్న డీసీఎం: ఇద్దరికి తీవ్ర గాయాలు

కొత్తకోట రూరల్: బైక్‌ను వెనుక నుంచి డీసీఎం ఢీకొనడంతో ఇద్దరు యువకులకు తీవ్ర గాయాలైన ఘటన కొత్తకోట బైపాస్ సమీపంలో గురువారం మధ్యాహ్నం చోటుచేసుకుంది. ఎస్ఐ మంజునాథ్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. జిల్లా కేంద్రానికి చెందిన స్నేహితులు రవి, రమేష్ బైక్‌పై మన్యంకొండ దైవదర్శనం కోసం బయలు దేరారు. కొత్తకోట బైపాస్‌కు రాగానే కర్నూల్ వైపు నుంచి హైదరాబాద్ వెళ్తున్న డీసీఎం అతివేగంగా వచ్చి బైక్‌ను ఢీకొనడంతో ఇద్దరు యువకులకు తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు వనపర్తి ఏరియా ఆస్పత్రికి తరలించారు.